# సంసారం!

శ్రీ అంబడిపూడి
బాలసుబ్రహ్మణ్యం

"యేమండీ-మీరు మరీ చిన్న పిల్లాడైపో తున్నారు" అంది మారాణి-మా రాణిగారికి నామీ దెప్పుడూ కోపంరాలేదు. పైగా నాతో యింత కష్టంగా మాట్లాడి ఎరుగదు. నేను చిన్న పిల్ల ణ్ణయిపోతూన్నానట! బహుశా నేను కథలు వ్రాయటం ఆమెకిష్టంలేదేమో!—అయినా రాణిగారింత వరకు కథలు వ్రాయవద్దనిగాని—కథల్ని వెక్కిరించటంకాని జరగలేదు-మరి మా రాణిగారికేం కోపం వచ్చిందో? నేనేం మాట్లాడ లేదు!

"మాట్లాడ రేమండి?" అంది చేతులతో భుజాన్ని కదిలిస్తూ-యీజీచైర్ మీద నడుం వాల్చాను. మాశారదగారు కుర్చీమీద కూర్చొ న్నారు. ఏం మాట్లాడాలో?—సమాధానం ఏం చెప్పను?

మళ్ళీ అడిగింది—"నామాట విన్నారా" అని.

"నేను చిన్నపిల్లాణ్ణిగా—ఏం మాట్లాడనూ?" అన్నా అమాయకంగా మాట్లాడుతూన్నట్టు నటిస్తూ—మారాణిగారికి నవ్వొచ్చింది.

"ఏమన్నా మాట్లాడితే నవ్విస్తారూ!" అంది నవ్వుతూ.

"అయితే ఏడిపించమంటారా? రాణిగారూ" అన్నాను.

"అబ్బ! పోదురూ! సరసాలకి వేళా పాళ లేదు-ఎప్పుడూ నవ్వే" అంది.

"ఆఫీసులాగా సరసాలక్కూడా టయిముం దేమిటి? మీ హయాములో!" అన్నాను—రాణిగారు లేచి పోబోతున్నారు.

హర్ హైనెస్‌గారికి కోపంవస్తే మనకి జరిగే పరాభవం యింతా అంతా కాదు-ఆవిడగారు సత్యాగ్రహం చేస్తే—అయ్యరు హోటల్లో అన్నపు మెతుకులు, మేకుల్లా వుంటుంది! తినలేకచావాలి. అందులో యిది వసంత ఋతువు—వెన్నెల రాత్రులు వృథా కాకూడదు. అంతేకాకుండా మారాణిగారి మనసు బహు కోమలమైంది. పాపం! చాలా బాధపడుతుంది! అని అనుకొని.

"రాణిగారు కూర్చోండి-యింతకీ అసలు సంగతి చెప్పరేం?-చిన్నపిల్లాణ్ణి నాసేరము లేవో తెలుపవే" అని రాగాలాపన చేయాలా అన్నాను. మారాణిగారు కొంచెం సిగ్గుపడింది.

"అదిగో మళ్ళీ మొదలెట్టారు-మీ అకటా వికటాలు" అంది.

"మళ్ళీ ఏం ఖర్మం—మొదట్నుంచి యింతేగా! పిల్లాణ్ణి కదూ?" అన్నాను.

"అబ్బ! మీరిలా వేధించుకు తింటూంటే ఎలాగండి!" అంది మూతి తిప్పుకొంటూ!

"అబ్బ! పిల్లాడికి పాలివ్వాలి-నీళ్ళుపోయాలి 'హాయీ' అంటూ జోలపాట పాడాలి కదూ?" అన్నాను.

'అలాగేవుంది మీతో, ఏమన్నా చెబుదా మనుకుంటే—మీ సరసాలు.'

"ఊఁ! చెప్పేదేమిటో చెప్పు! చెవులుమూసు

కొని కూర్చొనా?" అని చెవులుమూసుకొని కూర్చొన్నాడు (ఒకచేత్తో ఒక చెవిని)

"మరిచిపోయానండీ" అంది. తన జ్ఞాపకం లేమికి సిగ్గుపడ్తూ.

"తమరికి జ్ఞాపకశక్తి ఎక్కువగా వుందని, ఫస్టు ప్రైజు యిచ్చారట కదూ. నీవు చదువుకునేటప్పుడు స్కూల్లో" అన్నాను. ఆవిడ పకాపకా నవ్వుతూంది.

'ఈవాళ సినిమాకు వెళ్దామా రాణిగారు' అన్నా.

"వెళ్లండి. మీ యిష్టం" అంది.

"మీరురారా దేవిగారూ? మీకుకూడా మా అర్థికప్రణాళిలో కేటాయించామండి" అన్నాను

"ఎందుకండి. ఇన్ స్టేల్మెంట్ రోజులు" అంది తలకాయి కిందికివంచుకొని.

"అరెరె! రాణిగారు భలేమాటన్నారే—ఇంకోసారి అనండి విందాం" అన్నాను. కాసేపు ఇద్దరం నవ్వుకొన్నాము.

కబుర్లు చెప్పుకుంటూ కాసేపు గడిపాము. శారద హఠాత్తుగా 'వచ్చిందండి, వచ్చిందండి, వచ్చిందండి" అంది గభాగభా. నేను యింకా గాబరాగా.

'ఏం వచ్చిందండీ' అన్నాను కొంటెగా చూస్తూ—ఆవిడకు కోప మొకవైపు వస్తూన్నా. నాతో తిన్నగాకూర్చొని మాట్లాడేసమయం దొరకదని తమాయించుకొని మాట్లాట్టం మొదలెట్టింది.

'మీతో ఒకవిషయం చెప్పదల్చుకున్నాను' అంది.

'ఇప్పుడు చెప్పటానికి వచ్చారా? లేక చెప్పటానికి తల్చుకున్నానని చెప్పటానికి వచ్చారా?' అన్నా.

'మళ్లీ మొదలుపెట్టారు! నామాటవినండీ' అంది.

"చిత్తం. దేవిగారి ఆజ్ఞ శిరసావహిస్తాం!" అన్నాను.

"మీరు అనవసరంగా చాలా ఖర్చుపెడుతున్నారు" అని కాస్త ఆగింది.

"అవును పప్పు, బెల్లం, మిఠాయి కొనుక్కొని తింటూ. పిల్లాణ్ణికదూ ?"

"అబ్బ కాసేపు వూరకుండరు. చూడండి నెలకు యిన్ని పత్రికలేంచేసుకోను ?"

"చదువుకోను, పత్రికలుకొనటం అనవసరమా? సాయంత్రం పొద్దుపోయేదెల్లా నీవేగా మూడర పత్రికలు పట్టండని అడిగింది" అన్నా.

సరే పోనివ్వండి—ఒక దినపత్రిక చాలదూ రెండుమూడెందుకూ ?"

"ఒకటి నీవు చదవటానికి, యింకొకటి నేను చదవటానికి, మూడోది పొట్లాలు కట్టుకోటానికి యింకా దేనికన్నాను. యీమాత్రం వుపయోగించుకోటం తెలీదూ ?" అన్నాను. నవ్వలేక నవ్వింది.

"ఎంతచెప్పినా మీ సరసాలు పోనివ్వరుగదా ?"

"పోనిస్తే ఎలాగా, నీతో కబుర్లుచెప్పుకుంనే నవ్వాలికదా ?"

"ఇప్పుడు నన్నే డిపిస్తున్నారు—సరే రి

కాఫీ హోటల్లో అంత ఖర్చు పెడతారుగదా? ఏమేమి తింటారండీ?

"ఇడ్లీ, పెసరట్, వుప్మా, గోంగూర, తోటకూర వగైరాలు"

"ఇంట్లో తింటున్నారుగా మళ్ళీ డబ్బు దండగెందుకూ? తిన్నా రోజూ 4 రూపాయలా?"

"అయితే తింటం మానేయమంటావ్! అంతేనా!" అన్నాను సీరియస్‌గా.

"అబ్బే! ఆ మాట నేనన్నానా?" అంది భయపడ్తూ.

"కొంచెం తగ్గించుకోండి" అంది ఆమె భయాన్ని చూచి నేను జాలిపడ్డాను. శారద పక్కన కూర్చొని.

"భయపడ్డావా శారదా" అన్నాను. శారద మాట్లాళ్ళేదు.

"చెప్పా స్నేహితులు వెంబడిబడ్డారు. చిన్నతనంలో అందరిదగ్గర కాఫీ పార్టీ చేయించుకొన్నాం. ఇప్పుడు మనం చేయకపోతే బావుంటుందా. ఇల్లు వదిలేసరి! స్నేహితులు తయార్ ఏంచేయమంటావ్? చెప్పు!"

"అయినా ఏం స్నేహితులండి. కాపురం చేస్తున్నాడనేవంగతి ఆమాత్రం తెలుసుకోవద్దూ?" అంది.

"నిజమే, ఏంచేయమంటావ్, పదిమందితో వెడితే ఎలా?"

"బిల్లుచెల్లించటం మానుకోండి. ఆ దెబ్బతో"

"బిల్లు చెల్లించటం ఎలా మానుకొంటా నాకేసి చూసితే."

"డబ్బు మరచివచ్చాను అనండి—"

"తప్పక చెల్లించాల్సొస్తే—"

"ఏం చేస్తాం మన ఖర్మ. చెల్లించండి" అంది.

"ఇంతకీ వుపాయం చెప్పండి రాణీగారూ" అన్నాను.

"ఒకటి రెండుసార్లు కొంచెం కష్టపడి డబ్బు లేదోయ్" అనండి. చచ్చినట్టు చెల్లిస్తారు లేకపోతే కాఫీహోటలుకు రావటం మానుకొంటారు"

"బాగానే వుంది వుపాయం" అని మాఆవిడ చెప్పిన వుపాయం ఆచరణలోపెట్టి వారంరోజులు తిరిగిందో లేదో మిత్రబృందమంతా మటుమాయమయింది. మాఆవిడ బుఱ్ఱంటే సామాన్యమైన బుఱ్ఱ. ఎన్నిపత్రికలు చదివిందో! తెలుసా?

"ఏమటీ సినీమాలకి వెళ్ళటం తగ్గించరాదూ?" అంది. ఆవిడ నిజానికి సినిమాకెళ్ళాలని ఎక్కువ ప్రోద్బలంచేసేది శారద. అయినా నేను చేస్తున్నట్టుగా తగ్గించరాదు? అంటుంది. బాగుందీ వరస!

శారద అన్నట్టుగా సినిమాలకు వెళ్ళటం తగ్గించేశాను. తగ్గించేశానేమిటి? వెళ్ళటం మానేశాను.

"ఏమండి మంచిసినిమావచ్చిందట వెళ్దామా" అంది ఓరోజు. ఆవిడ ఈమాట ఎప్పుడంటుందా అని ఎదురుచూస్తూన్న నాకు మంచి సందు దొరికింది. రాణీగారికిష్టమైతే సినిమాకు వెళ్ళొచ్చు. లేకపోతే మానేయాలా? అన్నాను. శారద చిన్నబుచ్చుకొంది.

ఆరోజు సినిమాకు వెళ్ళలేదు. మొత్తానికి

రెండోరోజు సినిమా ప్రయాణం తప్పిందికాదు. ఆ తర్వాత మా ఆవిడ నేనుచేసే పైఖర్చులమీద దండయాత్ర చేయటం మొదలెట్టింది.

ఏమండి! మంగలివాడికి దండగెందుకు పావలా పెట్టి పదిబ్లేడ్లు తెచ్చుకోరాదా ?" అంటుంది మంగలిఖర్చు తగ్గించటానికి. యీరకంగా మా ఆవిడ దండయాత్రతో అనవసర ఖర్చులు మాని సంసార లోని యిన్‌ఫ్లేషన్ తగ్గించుకొన్నాం. యిప్పు డర్థమయింది మా ఆవిడచెప్పిన మాటలు.

కాని తమాషా ఏమిటంటే మాఆవిడ నాదగ్గిర కూర్చొని కబుర్లుచెప్పటం మొదలెట్టిందంటే నాకు భయమేస్తుంది. ఎందుకంటే మా బడ్జెట్‌లో ఏదేనా ఖర్చు అనవసరమని కొట్టేస్తుందో అని. నిజానికి యిదివరకటి ఖర్చుల్లో నాల్గోవంతు ఖర్చు పెట్టున్నా సుఖంగా గడిచిపోతూంది. అది సంసారంలో కిటుకులు. ఈలాంటికిటుకు లెన్నోవున్నయ్ ఎవరిల్లు వారు చక్కబెట్టుకోవాలంటే తగిన జంట వుంటేగాని సంసారనౌక నడవదు.


రీటా తల వెంట్రుకలను పెంచును.



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్. తలవెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు "రీటా" అమోఘముగా పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుంచి రీటాయే వాడుడు.

రీటా హిందూ దేశమంతటా దొరుకును
వెల సీసా 15 అణాలు.




**RITA**
**HAIR TONIC**